సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
మంగళవారం । 10 । డిసెంబర్ । 2024



చీనీ టన్ను రూ.37,280
అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.37,280 పలికాయి.



టమాట కిలో రూ.20
అనంతపురం కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.20 పలికింది. కనిష్టం రూ.5, సరాసరి రూ.10 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.5°/18.3°
జిల్లా పరిధిలో సోమవారం పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. చలి వాతావరణం నెలకొంది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

టీకాలపై అపోహలు వీడాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి

పుట్టపర్తి అర్బన్: అన్ని రకాల వ్యాధి నిరోధక టీకాలపై ప్రజలు అపోహలు వీడి వైద్య బృందాలకు సహకరించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి కోరారు. సోమవారం స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో వ్యాధి నిరోధక టీకాలపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. జిల్లాలోని 62 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి పర్యవేక్షణాధికారులు విచ్చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రతి వైద్యాధికారి, సిబ్బంది ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి నాగేంద్ర నాయక్, సర్వైలెన్స్ మెడికల్ ఆఫీసర్ వరుణ్, డాక్టర్ జ్యోత్స్న తదితరులు మాట్లాడారు. వ్యాధి నిరోధక టీకాలపై వచ్చిన అపోహలను క్షుణ్ణంగా తెలుసుకోవాలని, ప్రజల్లో వచ్చే అనుమానాలను నివృత్తి చేయాలని సూచించారు. హౌస్‌హోల్డ్ సర్వే, మైక్రో యాక్షన్ ప్లాన్ గురించి వివరించారు.

‘సంకల్ప్-2025’ను విజయవంతం చేయండి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీవైఈఓ రఘునాథరెడ్డి

పుట్టపర్తి అర్బన్: ఇంటర్‌లో ఉత్తీర్ణత శాతం పెంపే లక్ష్యంగా ఈ ఏడాది అన్ని జూనియర్ కళాశాలల్లోనూ అమలు చేయనున్న ‘సంకల్ప్-2025’ను విజయవంతం చేయాలని డీవైఈఓ రఘునాథరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం కొత్తచెరువు జూనియర్ కళాశాలను సందర్శించిన ఆయన విద్యార్థులకు పలు సూచలను చేశారు. విద్యార్థుల్లో ఏ, బీ, సీ గ్రూపులుగా విభజించి సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకూ స్టడీ అవర్స్ నిర్వహించి, ఉత్తీర్ణత శాతం పెంచనున్నట్లు చెప్పారు. జిల్లాలోని 22 కళాశాలల్లో ఫస్టియర్ 3,872 మంది, సెకండియర్‌లో 3,063 మంది చదువుతున్నారన్నారు.

గుడిబండ కొండలో చిరుత సంచారం



గుడిబండ: మండల కేంద్రం గుడిబండలోని కొండలో చిరుత సంచారం కలకలం రేపుతోంది. సమీప గ్రామాల్లో మేకలు, గొర్రెలు, పశువులు తదితర మూగజీవులపై గత కొన్ని రోజులుగా చిరుత దాడులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం రాత్రి పది గంటల సమయంలో గుడిబండకు చెందిన శ్రీరామప్ప ఇంటి ఆవరణలోని కుక్కపై చిరుత దాడి చేసింది. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి వన్యప్రాణుల నుంచి కాపాడాలని కోరుతున్నారు.

మెడికల్ షాపులు





- ఫార్మసిస్టులు లేని దుకాణాలే ఎక్కువ
- ఇష్టారాజ్యంగా మెడికల్ షాపుల నిర్వహణ
- ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందుల విక్రయాలు
- విచ్చలవిడిగా యాంటీబయాటిక్స్, పెయిన్ కిల్లర్స్
- నెలవారీ మామూళ్లతో తనిఖీలకు అధికారుల స్వస్తి





హిందూపురంలో ఓ మెడికల్ షాపు నిర్వాహకుడితో వినియోగదారుడి వాగ్వాదం

- హిందూపురంలోని ఓ ప్రైవేటు మెడికల్ షాపులో ఇద్దరు వ్యక్తులు వెళ్లి కొన్ని మందులు కొన్నారు. బిల్లు రూ.573 అయ్యింది. మందులు తీసుకుని నగదు చెల్లించారు. బిల్లు అడిగితే షాపు నిర్వాహకుడు నిరాకరించాడు. బిల్లు ఇవ్వడం కుదరదని.. తాను కూలి కోసం పని చేసే వ్యక్తి మాత్రమేనని సమాధానం ఇచ్చాడు.
- కొత్తచెరువులో ఓ ప్రైవేటు క్లినిక్ పక్కనే మెడికల్ షాపు ఉంది. డాక్టర్ మందులు రాసి ఇస్తారు. షాపులో వెళ్లి తీసుకుంటే డాక్టర్ ఫీజుతో సహా మొత్తం వసూలు చేస్తారు. పైగా ఎలాంటి బిల్లు ఇవ్వడం లేదు. ఇదేంటని అడిగితే ఇష్టం ఉంటే రండి.. లేదంటే ఇంకోచోటకు వెళ్లండని సమాధానం ఇస్తున్నారని బాధితులు తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా చాలాచోట్ల రసీదులు (బిల్లులు) లేకుండా మందులు విక్రయిస్తున్నారు. ఆయా మందులు తిని చాలామంది లేనిపోని రోగాల బారిన పడుతున్నారు. నివారించాల్సిన డ్రగ్స్ కంట్రోలర్స్ ఏడాదికి ఒకసారి కూడా తనిఖీలు చేయకపోవడంతో మెడికల్ షాపు నిర్వాహకులు ఇష్టారాజ్యంగా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు.



కొత్తచెరువులో బిల్లు ఇవ్వకుండా మందులు ఇచ్చే మెడికల్ షాపు ఇదే

సాక్షి, పుట్టపర్తి: మెడికల్ షాపులు.. ప్రొవిజన్ స్టోర్స్ మాదిరిగా ఇబ్బడిముబ్బడిగా ఏర్పాటవుతున్నాయి. ఫార్మసిస్టు లేకుండానే మెడికల్ షాపులు నిర్వహిస్తున్నారు. ఆర్‌ఎంపీ కోసం క్లినిక్‌కు అద్దె చెల్లించి.. పక్కనే మరో రూములో మందులు (ఔషధాలు) అమ్ముతారు. పట్టణాల నుంచి మండల కేంద్రాలు, గ్రామ స్థాయి వరకు ఈ సంస్కృతి వ్యాపించింది. పర్యవేక్షణ లేకపోవడంతో మెడికల్ షాపుల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు మామూళ్లు తీసుకుని కార్యాలయానికే పరిమితం కావడంతో మెడికల్ దందా భారీస్థాయిలో జరుగుతోంది. ఫలితంగా ప్రజల ప్రాణాలు గాల్లో దీపంలా మారాయి. హిందూపురం నుంచి కొత్తచెరువు వరకు ప్రతిచోటా మెడికల్ షాపుల్లో గోల్‌మాల్ జరుగుతోందనే ఆరోపణలు ఉన్నాయి.

రసీదు లేకుండానే మందులు..

జిల్లాలో పలు చోట్ల అర్హత లేకున్నా ఇతరుల సర్టిఫికెట్ల పేరు మీద మెడికల్ షాపులు నడుపుతున్నారు. అలాంటి చోట ఇంటర్ చదివిన వారిదే పెత్తనం. ఎలాంటి రసీదు లేకున్నా.. జబ్బు పేరు చెబితే మందులు అమ్ముతారు. ఏదైనా సమస్య వస్తే ఇబ్బంది అవుతుందని, దాని నుంచి బయటపడేందు కోసం కొనుగోలు చేసినట్టు బిల్లు ఇవ్వడం లేదు. ఈ షాపుల్లో డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేకుండా విక్రయించే వాటిలో యాంటీబయాటిక్స్, పెయిన్ కిల్లర్స్ అధికంగా ఉంటున్నాయి. డాక్టర్లతో సంప్రదించకుండానే చాలామంది ఆయా మందులు వాడి ఆరోగ్యం మరింత పాడుచేసుకుంటున్నారు. అయితే డ్రగ్స్ కంట్రోలర్‌లు ఎక్కడ ఉన్నారో? ఏం చేస్తున్నారో? ప్రజలకు తెలియడం లేదు. హిందూపురంలోని ఆఫీసులో అధికారి ఏ రోజూ కనిపించడని చెబుతున్నారు. నెలకు ఒకట్రెండు రోజులు మాత్రమే వచ్చి వెళ్తారని తెలిసింది.

ఫిర్యాదులు వస్తేనే తనిఖీలు

మెడికల్ షాపుల నిర్వహణలో అవకతవకలపై ఎలాంటి ఫిర్యాదులూ రాలేదు. బాధితులు ఫిర్యాదు చేస్తే తప్పకుండా తనిఖీలు చేస్తాం. బిల్లులు ఇవ్వని.. అర్హత లేని వారిపై చర్యలకు సిఫారసు చేస్తాం. అనుమతులు లేని దుకాణాలపై తనిఖీలు ముమ్మరం చేస్తాం. మందులు కొన్నవారికి బిల్లు అడిగే హక్కు ఉంటుంది. అయితే డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా ప్రజలకు మందులు అమ్మరాదు.

– రమేశ్‌రెడ్డి, డ్రగ్స్ కంట్రోలర్

వేరుశనగ చెక్క వేలం

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని జిల్లా జైలులో బుధవారం వేలం పాట నిర్వహిస్తున్నట్లు సూపరింటెండెంట్ రహ్మాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 25,000 కేజీల వేరుశనగ చెక్కకు వేలం పాట నిర్వహిస్తున్నామన్నారు. ప్రాంతీయ జైళ్ల ఉపశాఖ అధికారి కడప రేంజ్ వారి సమక్షంలో వేలం సాగుతుందన్నారు. ముందుగా రూ. 20,000 డిపాజిట్ చెల్లించాలన్నారు. వేలం పాట ముగిసిన తరువాత డిపాజిట్ వెనక్కి చెల్లిస్తామని పేర్కొన్నారు.

ముగిసిన బోరుగడ్డ అనిల్ పోలీస్ కస్టడీ



సర్వజనాసుపత్రిలో వైద్య పరీక్షల అనంతరం అనిల్‌కుమార్‌ను తీసుకెళ్తున్న పోలీసులు

అనంతపురం: బోరుగడ్డ అనిల్ కుమార్ పోలీస్ కస్టడీ ముగిసింది. టీడీపీ మహిళా అధికార ప్రతినిధి తేజస్విని ఫిర్యాదు మేరకు అనంతపురం నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. దీంతో పోలీసులు అనిల్‌ను మూడు రోజుల పాటు పోలీసుల కస్టడీకి కోరారు. ఆదివారం తెల్లవారుజాము 3 గంటలకు రాజమండ్రి జైలు నుంచి అనంతపురం నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు పోలీసు కస్టడీ ముగిసింది. అనంతపురం అర్బన్ డీఎస్పీ వి. శ్రీనివాసరావు నేతృత్వంలో విచారణ చేశారు. ఆఫ్ ద రికార్డు మాట్లాడిన మాటలను యూట్యూబ్ ఛానల్‌లో ప్రసారం చేశారని బోరుగడ్డ అనిల్ విచారణలో పేర్కొన్నట్లు తెలిసింది. అనంతరం ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి తిరిగి రాజమండ్రి జైలుకు తరలించారు.

బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి

- సచివాలయ సిబ్బందికి కలెక్టర్ ఆదేశం



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ చేతన్

ప్రశాంతి నిలయం: గ్రామ సచివాలయ సిబ్బందితో పాటు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే వారు కచ్చితంగా బయోమెట్రిక్ హాజరు వేయాల్సిందేనని కలెక్టర్ చేతన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల ద్వారా 232 అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యతా అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలు పరిష్కరించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోడంతోపాటు పరిష్కరించిన తరువాత దరఖాస్తుదారుకు మెసేజ్ పంపాలన్నారు. అన్ని శాఖల విభాగాధిపతులు బయోమెట్రిక్ హాజరు పూర్తిగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 11, 12 తేదీల్లో విజయవాడలో జరిగే కలెక్టర్ల సమావేశం కోసం అన్ని శాఖలకు సంబంధించిన నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీపీఓ విజయ్‌కుమార్, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, ల్యాండ్ సర్వే ఏడీఈ విజయశాంతి బాయి, ఎల్‌డీఎం రమణకుమార్, ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ తిప్పేంద్రనాయక్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి మోహన్‌రావు, ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ వరలక్ష్మి, డీఈఓ క్రిష్టప్ప, వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు, ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ శ్రీదేవి, క్రీడా ప్రాధికార సంస్థ అధికారి ఉదయ భాస్కర్, ఆర్టీసీ జీఎం రవిచంద్ర, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ సంజీవయ్య తదితరులు పాల్గొన్నారు.

అడవుల పరిరక్షణకు కృషి చేయాలి

అడవుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ చేతన్ పిలుపునిచ్చారు. జిల్లాలో అడవులకు నిప్పు పెట్టకుండా గొర్రెల కాపరులు, గ్రామీణులు, రైతులకు అవగాహన కల్గించేందుక అటవీశాఖ అధ్వర్యంలో చేపట్టనున్న సదస్సులకు సంబంధించి ‘అడవికి నిప్పు – మనిషికి ముప్పు’ పేరిట రూపొందించిన పోస్టర్లను కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆయన ఆవిష్కరించారు. డిసెంబర్ నుంచి మే నెల చివరి వరకు తరచుగా అడవుల్లో అగ్ని ప్రమాదాలు జరుగుతుంటాయని, వీటిని అరికట్టేందుకు ప్రజా చైతన్యం అవసరమన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, జిల్లా అటవీ శాఖ అధికారి చక్రపాణి, బుక్కపట్నం అటవీ క్షేత్ర అధికారి యామిని సరస్వతి, ఫారెస్ట్ సెక్షన్ అధికారి చంద్రా నాయక్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రాహుల్, రమణారెడ్డి తదితరుల పాల్గొన్నారు.

రైతు గోడు పట్టదా?



పొలంలోనే కుళ్లిపోయిన వరి పంటను పరిశీలించి, ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఉషశ్రీచరణ్

- ఆర్నెల్లు అవుతున్నా అందని పెట్టుబడి సాయం
- రైతు సమస్యలపై 13న చలో కలెక్టరేట్
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

పరిగి: రైతుల గోడు కూటమి సర్కారుకు పట్టడం లేదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ ధ్వజమెత్తారు. పరిగి మండలం ఊటుకూరు పంచాయతీలో రైతులు సాగు చేసిన వరి, మిరప, కంది, మొక్కజొన్న పంటలను ఆమె సోమవారం పరిశీలించి, రైతుల సాధకబాధకాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉషశ్రీచరణ్ మీడియాతో మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ పాలనలో ఆర్బీకే ద్వారా పంట విత్తు నుంచి మద్దతు ధరతో కొనుగోలు దాకా వ్యవసాయ సేవలన్నింటినీ ముంగిటకే తీసుకొచ్చామని, రైతు భరోసా, ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ వంటివి పక్కాగా అమలు చేసి రైతుపక్షపాతిగా నిలిచామని గుర్తుశారు. ప్రస్తుత కూటమి పాలన అందుకు విరుద్ధంగా ఉందన్నారు. అన్నదాతా సుఖీభవ పథకం కింద రైతుకు ఏడాదికి రూ.20వేల సాయం అందిస్తామన్న హామీని ఆరునెలలైనా అమలు చేయలేదన్నారు. ప్రకృతి విపత్తుల కారణంగా పంట నష్టపోయిన రైతులకు బీమా కానీ, పంట నష్టపరిహారం కానీ అందించకుండా తాత్సారం చేస్తోందని విమర్శించారు. అరకొరగా పండిన పంట దిగుబడులను మద్దతు ధరతో కొనుగోలు చేయడం లేదన్నారు. దేశానికి వెన్నెముక అయిన రైతులను అడుగడుగునా నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. రైతుల బాధలు, సమస్యలను ప్రభుత్వానికి తెలియజేయడానికి వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ఆదేశాల మేరకు ఈ నెల 13న ‘చలో కలెక్టరేట్’ నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు, ప్రజా సంఘాల నాయకులు, మేధావులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

మంత్రులు ప్రచారార్భాటాలకే పరిమితం..

జిల్లాలో ఇద్దరు మంత్రులు సవిత, సత్యకుమార్ ఉన్నా ప్రచారార్భాటాలకే పరిమితమయ్యారని, రైతుల సంక్షేమాన్ని ఏమాత్రమూ పట్టించుకోవడం లేదని ఉషశ్రీచరణ్ విమర్శించారు.

రైతులను ఆదుకోండి

గత ప్రభుత్వ హయాంలో రైతుభరోసా కేంద్రం ద్వారా గ్రామంలోనే విత్తనాలు, ఎరువులు, తదితర వ్యవసాయ సేవలన్నీ అందుబాటులో ఉండేవి. మద్దతు ధర ప్రకటించి పంటలను సైతం కొనుగోలు చేసి మార్కెటింగ్ సౌకర్యం కల్పించేవారు. రైతుభరోసా పథకం కింద ఏటా రూ.13,500 క్రమం తప్పకుండా బ్యాంకు ఖాతాల్లో జమ చేసేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. అన్నదాతా సుఖీభవ పథకం కింద రూ.20వేల సాయమందిస్తామని చెప్పినా ఇప్పటి వరకు ఇవ్వలేదు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేస్తే రైతులకు ఉపశమనంగా ఉంటుంది. రైతులను ఆదుకోవాలి.

– రవీంద్రారెడ్డి, తేజప్ప, రైతులు, ఊటుకూరు

దడ పుట్టిస్తున్న వరుస నేరాలు

- మడకశిర నియోజకవర్గంలో టెన్షన్ టెన్షన్
- కిడ్నాప్‌లు, లైంగిక వేధింపులు, చోరీల కలకలం
- పోలీసుల వైఫల్యంపై మండిపడుతున్న ప్రజలు



పోలీసులను నిలదీస్తున్న బాలిక బంధువులు

మడకశిర : కర్ణాటకకు సరిహద్దున ఉన్న మడకశిర నియోజకవర్గంలో ఇటీవల నేరాలు పెరిగాయి. ఒకదాని తర్వాత మరొకటి నమోదవుతూనే ఉన్నాయి. విద్యార్థుల అదృశ్యం, కిడ్నాప్ ఘటనలతో పాటు లైంగిక వేధింపులు కలకలం రేపుతున్నాయి. దొంగలు కూడా రెచ్చిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది. నేరాల నియంత్రణలో పోలీసులు విఫలమయ్యారనే విమర్శలు ఉన్నాయి. రెండు వారాల వ్యవధిలో చోటు చేసుకున్న పలు సంఘటనలు విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. మడకశిర మండలం ఆమిదాలగొంది జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న చేతన్‌కుమార్‌ను నవంబర్ చివరి వారంలో కిడ్నాప్ చేసి.. దారుణంగా హత్య చేసిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటనలో హెచ్‌ఎం నిర్లక్ష్యంగా వ్యవహరించారని అధికారులు సస్పెండ్ చేశారు. పోలీసులు ఈ కేసును గంటల వ్యవధిలోనే ఛేదించి, నిందితులను అరెస్ట్ చేశారు. మడకశిరలోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న ఓ విద్యార్థినిపై అధ్యాపకుడు వేధింపులకు పాల్పడిన ఘటన వారం రోజుల క్రితం వెలుగులోకి వచ్చింది. నాలుగు రోజుల క్రితం మడకశిర పట్టణంలోని చౌటిపల్లి ప్రాథమిక పాఠశాల వద్ద ఐదో తరగతి, నాలుగో తరగతి చదువుతున్న ఇద్దరు బాలికలను కిడ్నాప్ చేసేందుకు దుండగులు విఫల యత్నం చేశారు. ఐదు రోజుల క్రితం మడకశిరలో దొంగలు హల్‌చల్ చేశారు. కారులో వచ్చి మెడికల్ తదితర ఆరు షాపుల్లో చోరీలకు పాల్పడ్డారు.

బాలిక ఆచూకీ కోసం ఆందోళన..

పట్టణ పరిధిలోని బేగార్లపల్లిలో ఇంటర్ చదువుతున్న బాలిక కిడ్నాప్‌కు గురైంది. మరుసటి రోజే తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఐదు రోజులైనా బాలిక ఆచూకీ కనిపెట్టలేదని తల్లిదండ్రులు, బంధువులు సోమవారం పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. అంతకు మునుపు బాలిక కిడ్నాప్ ఘటనపై మనస్తాపం చెందిన తల్లి ఇంట్లోనే పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. తర్వాత స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న సమయంలో తండ్రి కూడా ఒంటిపై పెట్రోల్ పోసుకునేందుకు ప్రయత్నించగా బంధువులు అడ్డుకుని రక్షించారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

నియోజకవర్గంలో నేరాలు నివారించడానికి కఠిన చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థి చేతన్‌కుమార్ హంతకులను కొన్ని గంటల వ్యవధిలోనే అరెస్ట్ చేశాం. పట్టణంలో చోరీలు జరగకుండా గస్తీ ఏర్పాటు చేస్తాం. కిడ్నాప్‌నకు గురైన బాలిక ఆచూకీ కనిపెట్టడానికి చర్యలు తీసుకుంటున్నాం. సిబ్బంది కొరత అధికంగా ఉంది. ఫలితంగా నేరాల నివారణకు కొంత వరకు ఇబ్బందులు పడుతున్నాం.

– రాజ్‌కుమార్, సీఐ, మడకశిర

పల్లె ప్రోద్బలంతోనే అక్రమ కేసు

- రాజకీయ కక్షలతో కేసుల్లో ఇరికించారు
- న్యాయం కోసం ఎస్పీని ఆశ్రయించిన బాధితుడు



విలేకరులతో మాట్లాడుతున్న రామ్మోహన్, వైఎస్సార్‌సీపీ నాయకులు

పుట్టపర్తి టౌన్: మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ప్రోద్బలంతోనే తనతో సహా నలుగురిపై అక్రమ కేసులు బనాయించారని బుక్కపట్నం మండలం మారాలకు చెందిన ఈదులపల్లి రామ్మోహన్ ఆరోపించారు. వ్యక్తిగత కారణాలతో మేకల గౌతమ్ ఆత్మహత్య చేసుకుంటే.. తమకెలాంటి సంబంధమూ లేకపోయినా రాజకీయ కక్షలను మనసులో ఉంచుకుని ఇరికించారని, సమగ్ర విచారణ చేసి.. తమకు న్యాయం చేయాలని ఎస్పీ రత్నను కోరారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పెన్నోబులేసు, దళిత సంఘాలు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి రామ్మోహన్ తదితరులు వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో తమను కేసులో ఎలా ఇరికించారనే విషయాలను వెల్లడించారు. ‘నవంబర్ రెండో తేదీ రాత్రి మారాలకు చెందిన మేకల నారాయణస్వామి కుమారుడు గౌతమ్ తన నివాసంలో పెట్రోలు పోసుకుని నిప్పంటించుకున్నాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగళూరులోని విక్టోరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడు. అయితే ఆరు నెలల కిందట మొహర్రం వేడుకల్లో జరిగిన చిన్నపాటి గొడవ నేపథ్యంలో నారాయణస్వామి కుటుంబ సభ్యులు, నా కుటుంబ సభ్యులు పరస్పర ఫిర్యాదులు చేసుకున్నారు. పోలీసులు ఇరువర్గాలను రాజీ చేసి కేసు ముగించారు. ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా పనిచేశానని నాతో పాటు మరో ముగ్గురిని రాజకీయంగా అణగదొక్కాలనే ఉద్దేశంతో మాజీ మంత్రి పల్లె, టీడీపీ నాయకులు కుట్ర పన్ని గౌతమ్‌తో వాంగ్మూలం ఇప్పించి కేసు నమోదు చేయించారు’ అని రామ్మోహన్ వివరించారు. అక్రమ కేసు కారణంగా నాలుగు కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించి, సిట్ ద్వారా విచారణ చేయించి తమకు న్యాయం చేయాలని ఎస్పీని కోరినట్లు తెలిపారు. ఇందుకు ఎస్పీ సానుకూలంగా స్పందించి డీఎస్పీ ద్వారా మరోసారి విచారణ చేయిస్తామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, పతంజలి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బావిలో పడి యువకుడి మృతి


వినోద్‌కుమార్ (ఫైల్)

రొద్దం: కనిపించకుండా పోయిన ఓ యువకుడు నాలుగు రోజుల తర్వాత బావిలో మృతదేహంగా తేలాడు. పోలీసులు తెలిపిన మేరకు... రొద్దం మండలం నారనాగేపల్లికి చెందిన ఈడిగ సంజీవమ్మ కుమారుడు వినోద్‌కుమార్(30) నాలుగు రోజుల క్రితం కనిపించకుండా పోయాడు. ఘటనపై బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో సోమవారం గ్రామ శివారులోని బావిలో వినోద్‌కుమార్ మృతదేహం కనిపించడంతో గమనించిన స్థానికుల సమాచారం మేరకు కుటుంబసభ్యులు, పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. పాడుబడిన బావిలో నుంచి యువకుడి మృతదేహాన్ని వెలికి తీయించారు. మతిస్థిమితం లేని కారణంగా ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెంది ఉంటాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కృత్రిమ గర్భధారణతో బహుళ ప్రయోజనాలు

రాప్తాడు: కృత్రిమ గర్భదారణ ప్రక్రియతో పాడి రైతులకు బహుళ ప్రయోజనాలున్నాయని పశుగణాభివృద్ధి సంస్థ జిల్లా కార్యనిర్వహణాధికారి టి.వి.సుధాకర్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని యర్రగుంట గ్రామంలో ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భదారణ చేయు పాడి పశువుల ఎన్నికకు రైతులకు అవగాహన కల్పించడం, మంచి పశువులను ఎంపిక చేయడానికి ఉచిత గర్భకోశ చికిత్స శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. లింగ నిర్ధారిత వీర్యం సూదులను ప్రభుత్వమే సరఫరా చేస్తుందని పేర్కొన్నారు. ఈ వీర్యం వలన 90 శాతం పెయ్య దూడలే జన్మిస్తాయని తెలిపారు. విదేశీ జాతుల దూడలే కాక స్వదేశీ జాతులైన గిర్, సాహివాల్, తార్పర్కార్ వంటి జాతుల దూడల బ్రీడ్‌ను ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. భవిష్యత్తులో ఈ లింగ నిర్ధారిత వీర్యం అత్యధిక ప్రాచుర్యం పొందుతుందని పేర్కొన్నారు. అనంతరం పాడి పశువులకు గర్భకోశ పరీక్షలు చేసి, నట్టల నివారణ మందులు వేశారు. కార్యక్రమంలో ఏడీ ప్రకాష్, పశు వైద్య సిబ్బంది, గోపాల మిత్ర పాల్గొన్నారు.



అనంతపురంలోని ఆదిమూర్తినగర్‌లో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం



అర్బన్ హెల్త్ సెంటర్ పేరు మార్చి అప్పటి సీఎం వైఎస్ జగన్, దివంగత వైఎస్సార్ చిత్రాలు లేకుండా చేసిన దృశ్యం

వాస్తవాలకు రంగేశారు!

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టి నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ క్రమంలోనే పట్టణ ఆరోగ్య కేంద్రాల రూపురేఖలను మార్చేశారు. అన్ని సౌకర్యాలతో వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లను నిర్మించారు. తమకు చేరువగానే నాణ్యమైన వైద్య సేవలు అందడంతో అప్పట్లో ప్రజల నుంచి సర్వత్రా హర్షం వ్యక్తమైంది. దీన్ని కూటమి సర్కార్ జీర్ణించుకోలేకపోతోంది. రూ.5 కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన అనంతపురం నగరంలోని ఆరు పట్టణ ఆరోగ్య కేంద్రాలను నిర్వీర్యం చేసే పనులకు శ్రీకారం చుట్టింది. అత్యాధునిక సౌలభ్యాలతో ఏర్పాటు చేసిన పట్టణ ఆరోగ్య కేంద్రాలపై గత ప్రభుత్వ ఆనవాళ్లు లేకుండా కూటమి సర్కార్ చేపట్టిన చర్యలపై నేడు సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం





అనంతపురం రెండో రోడ్డులో గత ప్రభుత్వంలో నిర్మించిన వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం, ప్రస్తుతం పేరు మార్చిన దృశ్యం



పాతూరు సీడీ ఆస్పత్రి భవనంపై మాజీ సీఎం వైఎస్ జగన్, దివంగత నేత వైఎస్సార్ చిత్రాలు



వైఎస్ జగన్, వైఎస్సార్ చిత్రాలకు పెయింట్ కొట్టిన దృశ్యం

వీఐపీల భద్రతలో పీఎస్‌ఓలే కీలకం


మాట్లాడుతున్న ఎస్పీ రత్న


సమావేశానికి హాజరైన పీఎస్‌ఓలు

- ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: వీఐపీల భద్రతా విషయంలో పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్లు (పీఎస్‌ఓలు) ఎంతో కీలకమని ఎస్పీ రత్న అన్నారు. జిల్లాలోని వీఐపీల భద్రత విషయంలో విధులునిర్వర్తిస్తున్న పీఎస్‌ఓలకుజిల్లా పోలీస్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మూడు రోజుల పాటు జరిగే శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆమె ప్రారంభించి, మాట్లాడారు. మారుతున్న టెక్నాలజీలో వీఐపీలకు భద్రత కల్పించడం పెను సవాళ్లతో కూడుకొని ఉంటుందన్నారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ వీఐపీల రక్షణే ధ్యేయంగా పనిచేయాలని సూచించారు. మంచి ఆహారపు అలవాట్లతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. అనంతరం పీఎస్‌ఓల విధివిధానలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.

'పోలీసు స్పందన'కు 70 వినతులు..

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వివిధ సమస్యలపై 70 వినతులు అందాయి. ఎస్పీ రత్న స్వయంగా వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని చట్టపరిధిలోని అంశాలకు తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత ఎస్‌హెచ్‌ఓలను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, లీగల్ అడ్వైజర్ సాయినాథ్‌రెడ్డి, ఎస్బీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, డీసీఆర్‌బీ సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

బాగా చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలి..

బాగా చదివి భవిష్యత్తులో ఉన్నతమైన స్థానానికి ఎదగాలని పోలీస్ కుటుంబాల పిల్లలకు ఎస్పీ రత్న సూచించారు. గత విద్యాసంవత్సరంలో పది, ఇంటర్, డిగ్రీలో 90 శాతానికి పైగా మార్కులు సాధించిన పోలీసు కుటుంబాల్లోని పిల్లలకు మెరిట్ స్కాలర్‌షిప్, ప్రశంసాపత్రాలను సోమవారం ఆమె అందజేసి, అభినందించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో 50 మంది విద్యార్థులకు రూ.3,40,500 విలువైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ శ్రీనివాసులు, ఏఓ సుజాత, సూపరింటెండెంట్ సరస్వతి, రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం సభ్యుడు సూర్యకుమార్, తదితరులు పాల్గొన్నారు.

బడుగులపై టీడీపీ నేతల దౌర్జన్యం

- ఇంటి పునాది రాళ్లను తొలగించిన వైనం
- పక్కా గృహం మంజూరైనా తమ అనుమతి తప్పనిసరి అంటూ టీడీపీ నేతల హుకుం
- కలెక్టరుకు ఫిర్యాదు చేసిన బాధితులు


పునాది రాళ్లను తొలగించిన దృశ్యం

ఆత్మకూరు: 'చూడప్ప వినోదూ! నీకు మాకు మధ్య ఎలాంటి గొడవలు లేవు. అయినా ఇల్లు కట్టే పని ఆపేయ్. ఎందుకు చెప్తున్నానో అర్థం చేసుకో. లేదంటే లేనిపోని సమస్యల్లో చిక్కుకుంటావ్' అంటూ అనంతపురం జిల్లా ఆత్మకూరు మండలం బి.యాలేరు గ్రామానికి చెందిన బడుగులపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నేతలు దౌర్జన్యానికి తెగబడ్డారు. పక్కా గృహ నిర్మాణం మంజూరైనా తమ అనుమతి లేనిదే కట్టకూడదంటూ పునాది రాళ్లను పెకలించేశారు. ఘటనపై బాధితులు నేరుగా సోమవారం కలెక్టరేట్‌కు చేరుకుని ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆ జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలసి ఫిర్యాదు చేశారు. వివరాలు...

కూలి పనులతో జీవనం సాగిస్తున్న బి.యాలేరు గ్రామానికి చెందిన కుమ్మర వినోద్‌కుమార్, విమల దంపతులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్న కాలనీలో ఇంటి స్థలం మంజూరైంది. పక్కా గృహనిర్మాణానికి అనుమతులు సైతం అప్పటి జగన్ ప్రభుత్వం అనుమతులు జారీ చేసింది. అయితే ఆర్థిక ఇబ్బందుల కారణంగా గృహ నిర్మాణ పనులు అప్పట్లో వారు చేపట్టలేకపోయారు. కాస్త డబ్బు సమకూరడంతో ఇటీవల నిర్మాణ పనులు చేపట్టారు. ఆదివారం ఉదయం పునాది వేశారు. ఆ సమయంలో వినోద్‌ను కొందరు టీడీపీ నాయకులు కలసి తమ అనుమతి లేకుండా ఇంటి నిర్మాణ పనులు ఎలా చేపడతావంటూ మందలించారు. వెంటనే పనులు ఆపేయాలని, లేకపోతే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. అంతటితో ఆగకుండా రాత్రికి రాత్రే పునాది రాళ్లను పెకలించి వేశారు. ఘటనపై సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్‌ను కలసి ఫిర్యాదు చేసినట్లు బాధితులు వివరించారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

విద్యార్థిని మృతిపై పోలీసుల విచారణ

రొద్దం: ట్రాక్టర్ కిందపడి మృతి చెందిన విద్యార్థిని విషయం వెలుగు చూడకుండా రాత్రికి రాత్రే ఖననం చేసిన ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. వివరాలు... రొద్దం మండలం పి.రొప్పాల గ్రామానికి చెందిన శ్రీరాములు, వెంకటలక్ష్మమ్మ దంపతుల కుమార్తె హర్షిత (13) ఎనిమిదో తరగతి చదువుతోంది. ఆదివారం రాత్రి శ్రీరాములు ట్రాక్టర్ నడుపుతుండగా ప్రమాదవశాత్తు హర్షిత జారి కిందపడి అక్కడికక్కడే మృతిచెందింది. అయితే ఈ విషయాన్ని దాటిపెట్టి రాత్రికి రాత్రే బాలిక మృతదేహాన్ని కుటుంబసభ్యులు ఖననం చేశారు. అయితే బాలిక మృతిపై అనుమానాలు వ్యక్తం కావడంతో పోలీసులు సోమవారం ఉదయం ఆ గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. తల్లిదండ్రులను తమదైన శైలిలో ఆరా తీయడంతో వాస్తవం వెలుగు చూసింది. కాగా, పోలీసుల విచారణలోనూ వారు తొలుత మూర్ఛ వ్యాధితో మృతి చెందినట్లు బుకాయించినట్లుగా తెలిసింది. తల్లి వెంకటలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్ఐ నరేంద్ర... పాతిపెట్టిన బాలిక మృతదేహాన్ని సోమవారం సాయంత్రం తహసీల్దార్ నాగేంద్ర సమక్షంలో వెలికి తీయించి పంచనామా నిర్వహించిన అనంతరం తిరిగి ఖననం చేయించారు.

విషపు గుళికలు మింగిన డీలర్

గోరంట్ల: మండలంలోని మల్లాపల్లి గ్రామానికి చెందిన రేషన్ షాపు డీలర్, టీడీపీ బూత్ కమిటీ కన్వీనర్ శ్రీధర్ సోమవారం విషపు గుళికలు మింగి ఆత్మహత్యాయత్నం చేశాడు. వివరాలు.. మల్లాపల్లి రెవెన్యూ పరిధిలో తాను 4 ఎకరాల పొలం కొనుగోలు చేశానని, భూమి సాగు చేసే విషయంగా అదే గ్రామానికి చెందిన వెంకటరెడ్డి, ఆయన సోదరులు అడ్డుకోవడంతో పాటు కంచె కూడా పగులగొట్టరని బాధితుడు ఆత్మహత్యాయత్నానికి ముందు సెల్ఫీ వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశాడు. భూ సమస్యపై తన తండ్రికి తనకు మధ్య చిచ్చుపెడుతున్నారని, దీంతో జీవితంపై విరక్తి పెంచుకుని ఆత్మహత్య చేసుకుంటున్నట్లుగా తెలిపి విషపు గుళికలు మింగాడు. సామాజిక మాధ్యమాల్లో పోస్టు చూడగానే కుటుంబసభ్యులు అప్రమత్తమై బాధితుడిని వెంటనే గోరంట్లలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆయన పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం.

11, 12 తేదీల్లో ఫుడ్ కమిషన్ చైర్మన్ రాక

ప్రశాంతి నిలయం: రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ సీహెచ్ విజయప్రతాప్‌రెడ్డి ఈ నెల 11, 12 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నారు. పర్యటన ఏర్పాట్లపై సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత అధికారులతో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ సమీక్షించారు. కదిరి, ఓడీసీ, పెనుకొండ, సీకేపల్లి, సోమందేపల్లి, గోరంట్ల, హిందూపురం, లేపాక్షి మండలాలల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, వివిధ పాఠశాలలను విజయప్రతాప్‌రెడ్డి తనిఖీ చేయనున్నారని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం అమలు, ఎస్ఎంఎల్ స్టాక్ పాయింట్లతో పాటు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పలు కార్యక్రమాలను ఆయన తనిఖీ చేయనున్నట్లుగా వివరించారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి వంశీకృష్ణారెడ్డి, జిల్లా మేనేజర్ అశ్వత్థ నాయక్, డీఈఓ కిష్టప్ప, సాంఘిక సంక్షేమ అధికారి శివరంగప్రసాద్, గిరిజన సంక్షేమ అధికారి మోహన్‌రావు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి, ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బాలికను వంచించిన కేసులో యువకుడి అరెస్ట్

కదిరి టౌన్: స్థానిక మున్సిపల్ పరిధిలో నివాసముంటూ ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న మైనర్ బాలికను మాయమాటలతో వంచన చేసిన కేసులో ఓ యువకుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలు... పదో తరగతి చదువుతున్న బాలికను ప్రేమ పేరుతో ఆరు నెలల క్రితం ఆటో డ్రైవర్ నాగరాజు నమ్మించి శారీరకంగా లోబరుచుకున్నాడు. విషయాన్ని ఆలస్యంగా పసిగట్టిన బాలిక నాన్నమ్మ గత నెల 30న పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై విచారణ చేపట్టిన డీఎస్పీ శివనారాయణస్వామి పక్కా ఆధారాలతో సోమవారం ఉదయం కదిరి మండలం ఎర్రదొడ్డి టోల్‌గేట్ వద్ద నాగరాజును అరెస్ట్ చేశారు. విచారణ అనంతరం పోక్సో కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. కాగా, నకిలీ 1బీ పత్రాలు సృష్టించి విక్రయించిన అంశానికి సంబంధించి కదిరి మున్సిపల్ పరిధిలోని నాగిరెడ్డిపల్లికి చెందిన సుబ్రహ్మణ్యం, కిరణ్‌ను సోమవారం నాగిరెడ్డిపల్లి వద్ద అరెస్టు చేసినట్లు తనకల్లు ఎస్ఐ గోపి తెలిపారు.

యానిమేటర్ల జీతాలు స్వాహా


ఏపీఎం గంగన్నకు వినతిపత్రం ఇస్తున్న పాత యానిమేటర్లు

శెట్టూరు: తమకు మంజూరైన జీతాలను కొత్త యానిమేటర్లు స్వాహా చేశారంటూ పాత యానిమేటర్ల వాపోయారు. ఈ మేరకు సోమవారం మండల ఐకేపీ కార్యాలయంలో ఏపీఎం గంగన్నను పాత యానిమేటర్ల పార్వతమ్మ, గీతమ్మ, శివలింగమ్మ కలసి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. మే, జూన్ నెలలకు సంబంధించి తమకు మంజూరైన జీతాలు డ్రా చేసి ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. దీనికి అక్కడే ఉన్న సీసీ లక్ష్మీపతి మాట్లాడుతూ.. సంబంధిత సీసీల సంతకాలు లేకుండా చెక్కులను కొత్త యానిమేటర్లు డ్రా చేసినట్లు వివరించారు. వారితో రికవరీ చేయించి చెల్లిస్తామని చెప్పుకొచ్చారు. వాస్తవానికి ఈ ఏడాది జూన్ నెల వరకు 33 మంది పాత యానిమేటర్లు పని చేశారు. ప్రభుత్వం మారిన తర్వాత 28 మంది యానిమేటర్లను బలవంతంగా తొలగించి, వారి స్థానంలో జూలైలో కొందరిని, ఆగస్టులో మరికొందరిని నియమించారు. అప్పటి వరకూ శెట్టూరు, చెర్లోపల్లి, ములకలేడు, లక్ష్మంపల్లి క్లస్టర్లలో 33 మంది యానిమేటర్లు పనిచేశారు. వీరికి జూన్, జూలైకు సంబంధించి మంజూరైన జీతాలను కొత్తగా వచ్చిన సీసీలు, కొత్తగా ఏర్పడిన గ్రామ సమాఖ్య సంఘాల నేతలు కలిసి కొత్తగా వచ్చిన యానిమేటర్లకు కట్టబెట్టారు. మే, జూన్, జూలై నెలల్లో పనిచేయకపోయిన వారికి జీతాలు ఎలా చెల్లించారో అర్థం కావడం లేదంటూ పాత యానిమేటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. రూ. 4.48 లక్షల సొమ్ము పక్కదారి పట్టించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న మంజుల

పెనుకొండ రూరల్: భూ వివాదం కారణంగా ఓ మహిళ ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... పెనుకొండ మండలం శెట్టిపల్లి గ్రామానికి చెందిన మంజుల కుటుంబసభ్యులకు పూర్వీకుల నుంచి సర్వే నంబర్ 28-2లోని 28 సెంట్ల భూమి సంక్రమించింది. ఇందులో సోమవారం పండ్ల మొక్కలు నాటుతుండగా రెవెన్యూ, పోలీసులు అడ్డుకున్నారు. ఏళ్ల తరబడి సాగులో ఉన్న తమను అధికారులు ఆక్షేపించడంతో జీవితంపై విరక్తి చెందిన మంజుల అక్కడే శరీరంపై పెట్రోల్ పోసుకుని నిప్పు అంటించుకునే ప్రయత్నం చేసింది. గమనించిన స్థానికులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో కంట్లో పెట్రోలు పడి అస్వస్థతకు గురైన బాధితురాలిని కుటుంబసభ్యులు పెనుకొండలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పోక్సో కేసులో నిందితుడికి రిమాండ్

పుట్టపర్తి టౌన్: మండల పరిధిలోని ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సురేష్ తెలిపారు. వివరాలను సోమవారం ఆయన వెల్లడించారు. ఐదు రోజుల క్రితం పుట్టపర్తి మండలంలోని ఓ గ్రామానికి 6వ తరగతి విద్యార్థిపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి ద్వారా విషయం తెలుసుకున్న తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పుట్టపర్తి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం గంటల మారెమ్మ ఆలయం వద్ద తచ్చాడుతున్న నిందితుడిని గుర్తించి, అరెస్ట్ చేశారు. విచారణ అనంతరం నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

20 గొర్రెల అపహరణ


బాధితుడు రామాంజినేయులు

యల్లనూరు: మందలోని 20 గొర్రెలను దుండగులు అపహరించుకెళ్లినట్లు బాధిత కాపరి రామాంజనేయులు వాపోయాడు. వివరాలు.. యల్లనూరు మండలం కూచివారిపల్లి గ్రామానికి చెందిన రామాంజనేయులు గొర్రెల పోషణతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో తనకున్న 250 గొర్రెలను గ్రామ శివారులోని దొడ్డిలో వదిలి ఇంటికెళ్లి నిద్రించాడు. ఉదయం మంద వద్దకెళ్లి పరిశీలిస్తే అందులో 20 గొర్రెలు తక్కువగా ఉన్నట్లుగా గుర్తించాడు. చుట్టుపక్కల ఉన్న ఆనవాళ్లను బట్టి గొర్రెలను దుండగులు అపహరించుకెళ్లినట్లు నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

పాపాఘ్ని నదిలో మృతదేహం

ఎన్పీకుంట: మండలంలోని సారగుండ్లపల్లి సమీపంలో పాపాఘ్ని నదిలో సోమవారం ఉదయం ఓ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ వలీబాషా అక్కడకు చేరుకుని మృతదేహాన్ని వెలికి తీయించి, పరిశీలించారు. మృతుడిని గాండ్లపెంట మండలం కురుమామిడి పంచాయతీ గుట్టకిందపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీరెడ్డి (48)గా గుర్తించారు. మతిస్థిమితం లేని కారణంగా ఊరూరు తిరిగేవాడని బంధువులు తెలిపారన్నారు. కాలినడకన నది దాటే క్రమంలో ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెంది ఉంటాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి.

ఆకట్టుకున్న కళాఉత్సవ్

పుట్టపర్తి: బుక్కపట్నంలోని ఉపాధ్యాయ శిక్షణ సంస్థ(డైట్)లో సోమవారం నిర్వహించిన కళాఉత్సవ్ ఆకట్టుకుంది. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి పలు పాఠశాలలకు చెందిన 9, 10, 11, 12 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారని ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. నాటకం, నృత్యం, మ్యూజిక్, ఫోక్ డ్యాన్స్ తదితర పోటీల్లో ప్రతిభ చాటి ప్రథమ స్థానంలో నిలిచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. మ్యూజిక్‌లో రాప్తాడు పాఠశాలకు చెందిన కీర్తన, ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్‌లో అభిరానందన్ (రాప్తాడు), నృత్యంలలో రాయదుర్గం బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని సాయిశ్రీ దీప్తి, గ్రూప్ డ్యాన్స్‌లో బుక్కపట్నం బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన శ్వేత, మరో 20 మంది బాలికలు, ట్రెడిషనల్ స్టోరీలకు సంబంధించి రాప్తాడు పాఠశాలకు చెందిన భవిష్యకుమార్ విజేతలుగా నిలిచారన్నారు. విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో వ్యాయామ అధ్యాపకుడు రామకృష్ణ, అధ్యాపకులు లక్ష్మీనారాయణ, రాధిక, గోవింద రాజులు, సిబ్బంది పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్


జానపద నృత్యం చేస్తున్న విద్యార్థులు


శాస్త్రీయ నృత్యం చేస్తున్న విద్యార్థిని